
సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు
మంగళవారం । 23 । ఏప్రిల్ । 2024



సోమశిలలో 8.41 టీఎంసీలు

సోమశిల: సోమశిల జలాశయంలో సోమవారం సాయంత్రానికి 8.419 టీఎంసీల నీరు నిల్వ ఉంది. వివిధ కాలువలకు 350 క్యూసెక్కులను విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రాములు)	రూ.75,460
22 క్యారెట్ల ఆర్నమెంట్ (గ్రా)	రూ.6,740
మూడు శాతం జీఎస్టీతో	రూ.6,942
సవర (8 గ్రాములు)	రూ.55,536



విస్తృత ప్రచారం

నగరంలోని తొమ్మిదో డివిజన్లో వైఎస్సార్సీపీ నెల్లూరు లోక్‌సభ, సిటీ అభ్యర్థులు విజయ సాయిరెడ్డి, ఖలీల్ అహ్మద్ ప్రచారం చేశారు. ఫ్యాన్ గుర్తుకు ఓటేయాలని కోరారు. 8లో

సుముహూర్తాన నామినేషన్ల వెల్లువ

రానున్న ఎన్నికలకు సంబంధించిన నామినేషన్ల పర్వం చివరి దశకు చేరుకుంటోంది. అభిమానుల సందడి.. కుటుంబసభ్యుల దీవెనలు.. మతపెద్దల ఆశీర్వాదాల నడుమ అభ్యర్థులు ర్యాలీగా పయనమై ఆయా ఆర్వో కార్యాలయాల్లో తమ నామినేషన్లను సమర్పించారు. సోమవారం.. సుముహూర్తాన జిల్లా వ్యాప్తంగా మొత్తం 44 నామినేషన్లు దాఖలయ్యాయి. – సాక్షి నెట్‌వర్క్

నిరాడంబరంగా..



నామినేషన్‌ను దాఖలు చేస్తున్న ఆదాల ప్రభాకర్‌రెడ్డి

నెల్లూరు సిటీ: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నెల్లూరు రూరల్ అభ్యర్థిగా ఆదాల ప్రభాకర్‌రెడ్డి తన నామినేషన్‌ను సోమవారం దాఖలు చేశారు. మినీబైపాస్ రోడ్డులోని తన నివాసంలో కుటుంబసభ్యుల సమక్షంలో వేదమంత్రోచ్చారణల నడుమ ప్రత్యేక పూజలను వేద పండితులు నిర్వహించారు. అనంతరం పాస్టర్లు, ముస్లిం మతపెద్దల నుంచి ఆశీర్వాదం అందుకున్నారు. అభిమానులు, కార్యకర్తల ఆనందోత్సాహాల నడుమ బయల్దేరారు. మూలస్థానేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు చేసిన అనంతరం ఆర్డీఓ కార్యాలయానికి నిరాడంబరంగా చేరుకొని నామినేషన్ పత్రాలను ఆర్వో మలోలకు అందజేశారు. మేయర్ స్రవంతి, ఆనం విజయకుమార్‌రెడ్డి, స్వర్ణా వెంకయ్య, హయత్‌బాబా పాల్గొన్నారు.

హ్యాట్రిక్‌పైనే గురి..



నామినేషన్ వేస్తున్న కాకాణి గోవర్ధన్‌రెడ్డి

వెంకటాచలం: సర్వేపల్లి నుంచి ఇప్పటికే వరుసగా రెండుసార్లు గెలుపొందిన మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి హ్యాట్రిక్ సాధించడమే లక్ష్యంగా ముందుకెళ్తున్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సర్వేపల్లి నియోజకవర్గ అభ్యర్థిగా తన నామినేషన్‌ను వెంకటాచలంలో సోమవారం దాఖలు చేశారు. ముత్తుకూరు మండలం బ్రహ్మదేవికి చెందిన బషీర్‌సాహెబ్ (ముస్లిం), మనుబోలుకు చెందిన కంచె పద్మమ్మ (ఎస్టీ), తోటపల్లిగూడూరు మండలం తోటపల్లికి చెందిన మూగ ఏడుకొండలు (ఎస్సీ), వెంకటాచలానికి చెందిన మందల వెంకటశేషయ్య (బీసీ)తో కలిసి వెళ్లి రెండు సెట్ల నామినేషన్ పత్రాలను ఆర్వో చిన ఓబులేసుకు సమర్పించారు. కాకాణి కుమార్తె పూజిత సైతం రెండు సెట్ల నామినేషన్లను దాఖలు చేశారు.

ఆర్భాటాలకు దూరంగా..



నామినేషన్ పత్రాలను సమర్పిస్తున్న మధుసూదన్‌యాదవ్

కందుకూరు: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కందుకూరు అభ్యర్థిగా బుర్రా మధుసూదన్‌యాదవ్ ఒక సెట్ నామినేషన్ పత్రాలను సోమవారం దాఖలు చేశారు. ఎలాంటి ఆర్భాటం లేకుండా సాదాసీదాగా తన నామినేషన్ పత్రాలను ఆర్వో విద్యాధరికి అందజేశారు. తొలుత కందుకూరు గ్రామదేవత అంకమ్మ తల్లి.. అనంతరం మహదేవపురానికి చేరుకొని అక్కడి అంకమ్మ తల్లి ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం సబ్ కలెక్టర్ కార్యాలయానికి చేరుకొని నామినేషన్ వేశారు. పార్టీ నేత కొండూరి వసంతరావు పాల్గొన్నారు. కాగా అధికారికంగా మరో సెట్ నామినేషన్‌ను ఈ నెల 24న ఆయన దాఖలు చేయనున్నారు.

ఖలీల్ తరఫున..



నామినేషన్ ప్రతులను అందజేస్తున్న చంద్రశేఖర్‌రెడ్డి

నెల్లూరు(బారకాసు): రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నెల్లూరు సిటీ అభ్యర్థిగా పోటీ చేయనున్న ఖలీల్ అహ్మద్ తరఫున ఒక సెట్ నామినేషన్ పత్రాలను పార్టీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖరరెడ్డి దాఖలు చేశారు. ఈ మేరకు నగరపాలక సంస్థ కార్యాలయంలో రిటర్నింగ్ అధికారి, కమిషనర్ వికాస్ మర్మత్‌కు నామినేషన్‌ను సోమవారం సమర్పించారు. కాగా అధికారికంగా నామినేషన్‌ను ఈ నెల 25న ఖలీల్ దాఖలు చేయనున్నారు. కార్యక్రమానికి భారీగా హాజరై విజయవంతం చేయాలని ఆయన అభిమానులు కోరుతున్నారు.

న్యూస్‌రీల్

చెక్‌పోస్టుల్లో ఆకస్మిక తనిఖీలు



నెల్లూరు(క్రైమ్): ఎన్నికల సందర్భంగా నగరంలోని సాలుచింతల, మెడికవర్ హాస్పిటల్, వెంకటేశ్వరపురంలో గల చెక్‌పోస్టులను ఎస్పీ ఆరిఫ్ హఫీజ్ సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రతి వాహనాన్నీ క్షుణ్ణంగా తనిఖీ చేసి మద్యం, నగదు అక్రమ రవాణాను కట్టడి చేయాలని సూచించారు. సీ విజిల్ ద్వారా ఫిర్యాదు చేసినా, కోడ్ ఉల్లంఘనకు పాల్పడినా తక్షణమే స్పందించాలన్నారు.

నగదు, మద్యం స్వాధీనం

- చిన్నబజార్ పోలీస్‌స్టేషన్ పరిధిలో రూ.1,86,500, సైదాపురంలో రూ.93,400.. రూ 18,675 విలువగల తొమ్మిది పీడీఎస్ బియ్యం బస్తాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.
- సైదాపురం పరిధిలో 12, కొడవలూరులో 21, మర్రిపాడులో 35, కృష్ణపట్నంలో ఎనిమిది, కొండాపురంలో 33, వీకేపాడులో 30, వీవీపాళెంలో 14, కావలి రూరల్‌లో 43, ఆత్మకూరులో 10 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు.
- ఏఎస్‌పేటలో 8500 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశారు.

ఉత్తీర్ణత @ 88.16%



గణేశ్ (597) | మహిక (597) | నేహాసాయి (596) | సాయిహర్షిణి (595) | సాయిపర్ణిక (592) | లక్ష్మీతేజశ్రీ (590) | జ్యోత్స్నప్రియ (590)

- విడుదలైన పదో తరగతి రిజల్ట్స్
- మరోసారి బాలికలదే పైచేయి
- ఫలితాల్లో పై..పైకి

నెల్లూరు(అర్బన్): పదో తరగతి పరీక్ష ఫలితాలు ఎప్పుడు విడుదలవుతాయాననే విద్యార్థుల నిరీక్షణకు తెరపడింది. విజయవాడలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో ఫలితాలను విడుదల చేశారు. ఇందులో 88.16 శాతం ఉత్తీర్ణతతో రాష్ట్రంలో 15వ స్థానంలో జిల్లా నిలిచింది. గత నెల 18 నుంచి నెలాఖరు వరకు పరీక్షలను నిర్వహించగా, కేవలం 22 రోజుల్లో ఫలితాలను విడుదల చేయడం గమనార్హం.

24,500 మంది పాస్

జిల్లాలో 27,788 మంది పరీక్షలు రాయగా, 24,500 మంది ఉత్తీర్ణులయ్యారు. 2022 – 23లో 75.61 శాతం ఉత్తీర్ణత నమోదు కాగా, ఈ దఫా అది దాదాపు 13 శాతం పెరిగింది.

బాలికలదే హవా

- ఈ పరీక్షల్లోనూ బాలికలే పైచేయి సాధించారు. పరీక్షలకు హాజరైన 13,862 మంది బాలికల్లో 12,497 మంది ఉత్తీర్ణులయ్యారు. 90.15 శాతం ఉత్తీర్ణత నమోదైంది.
- 13,926 మంది బాలురకు గానూ 12,003 మంది పాసై 86.19 శాతం ఉత్తీర్ణత సాధించారు. జిల్లా వ్యాప్తంగా ప్రథమ స్థానంలో 20,201 మంది, ద్వితీయ స్థానంలో 3019 మంది, తృతీయ స్థానంలో 1280 మంది ఉత్తీర్ణులయ్యారు.

ఫలితాల సరళి ఇలా..

విద్యా సంవత్సరం	పరీక్ష రాసిన వారు	ఉత్తీర్ణులైన వారు	శాతం
2016 - 17	33,592	31,846	94.80
2017 - 18	32,854	26,404	80.36
2018 - 19	33,903	28,205	83.19
2019 - 20	కోవిడ్ కారణంగా పరీక్షలు జరగలేదు.	అందరూ పాస్	--
2020 - 21	కోవిడ్ నేపథ్యంలో పరీక్షల రద్దు	ఆల్ పాస్	--
2021 - 22	33,059	22,005	66.56
2022 - 23	27,067	20,466	75.61
2023 - 24	27,788	24,500	88.16

వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేయండి



మాట్లాడుతున్న హరినారాయణన్

నెల్లూరు(బారకాసు): ఎన్నికల తరుణంలో జిల్లా సరిహద్దులు, ప్రధాన మార్గాల్లో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టుల వద్ద ప్రతి వాహనాన్నీ క్షుణ్ణంగా తనిఖీ చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ హరినారాయణన్ ఆదేశించారు. కార్పొరేషన్ కార్యాలయ ఆవరణలోని కమాండ్ కంట్రోల్ సెంటర్ భవనంలో అధికారులతో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాత్రివేళా తనిఖీలను ముమ్మరంగా చేపట్టాలని చెప్పారు. ఓటర్లను ప్రలోభాలకు గురిచేసే వివిధ వస్తువుల పంపిణీని అరికట్టాలని చెప్పారు. గూడ్స్ వెహికల్స్, కంటైనర్లు, బస్సులు, లారీలతో పాటు ద్విచక్రవాహనాలను సైతం తనిఖీ చేయాలని సూచించారు. ఎపిక్ కార్డులను త్వరగా పంపిణీ చేయాలన్నారు. ట్రెయినీ కలెక్టర్ సంజనాసిన్హా, డీఆర్వో లవన్న, నోడల్ అధికారులు బాపిరెడ్డి, పద్మావతి, కన్నమనాయుడు తదితరులు పాల్గొన్నారు.

నేడు నామినేషన్ వేయనున్న విజయసాయిరెడ్డి

నెల్లూరు(దర్గామిట్ట): వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నెల్లూరు లోక్‌సభ అభ్యర్థిగా వేణుంబాక విజయసాయిరెడ్డి తన నామినేషన్‌ను మంగళవారం మధ్యాహ్నం 12.30కు కలెక్టర్ కార్యాలయంలో దాఖలు చేయనున్నారు. రామ్మూర్తినగర్‌లోని తన కార్యాలయం నుంచి ఉదయం 11 గంటలకు పార్టీ నేతలు, కార్యకర్తలు, అభిమానులతో కలిసి ర్యాలీగా వెళ్లి నామినేషన్‌ను సమర్పించనున్నారు. నెల్లూరు పార్లమెంట్ పరిధిలోని ఏడు నియోజకవర్గాల నుంచి భారీగా తరలిరానున్నారు. విజయసాయిరెడ్డి స్వగ్రామం తాళ్లపూడి నుంచి అభిమానులు హాజరుకానున్నారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

సందడే.. సందడి

- జిల్లాలో ఎన్నికల కోలాహలం
- లోక్‌సభకు మూడు.. అసెంబ్లీకి 41 నామినేషన్ల దాఖలు

నెల్లూరు(దర్గామిట్ట): ఎన్నికల తరుణంలో నామినేషన్లను సమర్పించే అభ్యర్థులు.. వారి అభిమానులతో జిల్లాలో సోమవారం సందడి నెలకొంది. జిల్లా వ్యాప్తంగా పలువురు అభ్యర్థులు 44 సెట్ల నామినేషన్ పత్రాలను ఆయా ఆర్వోలకు అందజేశారు.

- టీడీపీ నెల్లూరు లోక్‌సభ అభ్యర్థిగా పోటీ చేయనున్న వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి రెండు సెట్లు.. ఇండిపెండెంట్ అభ్యర్థిగా కొప్పాల రఘు ఒక సెట్ నామినేషన్ పత్రాలను ఆర్వో, కలెక్టర్ హరినారాయణన్‌కు సమర్పించారు.
- వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కందుకూరు నియోజకవర్గ అభ్యర్థిగా బుర్రా మధుసూదన్ యాదవ్.. తాడికొండ రాంబాబు ఒక సెట్ నామినేషన్ పత్రాలను ఆర్వో విద్యాధరికి అందజేశారు.
- కాంగ్రెస్ నుంచి ఒకరు, ఇండిపెండెంట్‌గా మరొకరు నామినేషన్‌ను దాఖలు చేశారు.
- కావలి నుంచి ఇండిపెండెంట్లుగా ఇద్దరు అభ్యర్థులు రెండు సెట్ల చొప్పున.. మరో ఇద్దరు ఒక్కో సెట్ చొప్పున.. జైభారత్ పార్టీ తరఫున ఒకరు నామినేషన్ వేశారు.
- వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆత్మకూరు అభ్యర్థిగా మేకపాటి విక్రమ్‌రెడ్డి తరఫున ఒక సెట్ నామినేషన్ దాఖలైంది.
- టీడీపీ అభ్యర్థిగా ఆనం రామనారాయణరెడ్డి నాలుగు సెట్ల నామినేషన్ పత్రాలను ఆర్వో మధులతకు అందజేశారు. ఇండిపెండెంట్‌గా ఓ అభ్యర్థి నామినేషన్ వేశారు.
- కోవూరు నుంచి జైభారత్ పార్టీ తరఫున ఒక నామినేషన్ దాఖలైంది.
- వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నెల్లూరు రూరల్ అభ్యర్థిగా ఆదాల ప్రభాకర్ రెడ్డి రెండు సెట్ల నామినేషన్ పత్రాలను ఆర్వో మలోలకు సమర్పించారు.
- ఇండిపెండెంట్లుగా ఒకరు రెండు సెట్లు, మరొకరు ఒక సెట్, అఖిల భారతీయ జన్‌సంఘ్ తరఫున రెండు సెట్ల నామినేషన్లు దాఖలయ్యాయి.
- వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నెల్లూరు సిటీ అభ్యర్థి ఖలీల్ అహ్మద్ తరఫున ఒక సెట్ నామినేషన్‌ను పార్టీ జిల్లా అధ్యక్షుడు పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి ఆర్వో వికాస్ మర్మత్‌కు అందజేశారు.
- టీడీపీ అభ్యర్థిగా నారాయణ, పొంగూరు రమాదేవి ఒక సెట్ చొప్పున నామినేషన్‌ను దాఖలు చేశారు.
- పిరమిడ్ పార్టీ, భారతీయ చైతన్య యువజన పార్టీ తరఫున ఒక్కో నామినేషన్ దాఖలైంది.
- వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సర్వేపల్లి అభ్యర్థిగా కాకాణి గోవర్ధన్‌రెడ్డి, కాకాణి పూజిత రెండు సెట్ల చొప్పున నామినేషన్ పత్రాలను ఆర్వో చిన ఓబులేసుకు సమర్పించారు.
- కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా చంద్రశేఖర్ రెండు సెట్ల నామినేషన్లు దాఖలు చేశారు.
- ఇండిపెండెంట్లుగా ముగ్గురు నామినేషన్లను సమర్పించారు.
- టీడీపీ ఉదయగిరి అభ్యర్థిగా కాకర్ల సురేష్ ఒక సెట్ నామినేషన్ పత్రాలను ఆర్వో ప్రేమ్‌కుమార్‌కు అందజేశారు.
- ఇండిపెండెంట్‌గా ఒకరు నామినేషన్ వేశారు.

డిగ్రీ పరీక్షల్లో ఆరుగురి డీబార్

వెంకటాచలం: వీఎస్‌యూ పరిధిలోని అనుబంధ కళాశాలల్లో సోమవారం నిర్వహించిన డిగ్రీ పరీక్షల్లో ఆరుగురు విద్యార్థులు డీబారయ్యారని పరీక్షల నిర్వహణాధికారి మధుమతి ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం నిర్వహించిన ఐదో, ఆరో సెమిస్టర్ పరీక్షల్లో 4788 మందికి గానూ 4363 మంది హాజరయ్యారు. మధ్యాహ్నం నిర్వహించిన నాలుగో సెమిస్టర్ పరీక్షకు 8676 మందికి గానూ 505 మంది గైర్హాజరయ్యారని చెప్పారు.

త్వరలో టీడీపీ రహిత రాష్ట్రంగా ఏపీ

- రాష్ట్రంలో మళ్లీ వైఎస్సార్‌సీపీ విజయం ఖాయం
- ప్రజలకు అందుబాటులో ఉంటా
- నెల్లూరు ఎంపీ అభ్యర్థి విజయసాయిరెడ్డి


మాట్లాడుతున్న వేణుంబాక విజయసాయిరెడ్డి

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): 'ఏపీని వైఎస్సార్‌సీపీ రహితం చేస్తానని చంద్రబాబు నాయుడు ఎన్నికల ప్రచారంలో అనడం హాస్యాస్పదంగా ఉంది. నిజానికి ఓటర్లు త్వరలో ఆంధ్రప్రదేశ్‌ను టీడీపీ రహితం చేయడానికి ఎంతో పట్టుదలతో ఉన్నారు. ఈ విషయాన్ని బాబు తెలుసుకుంటే చాలా మంచిది' అని వైఎస్సార్‌సీపీ నెల్లూరు ఎంపీ అభ్యర్థి వేణుంబాక విజయసాయిరెడ్డి అన్నారు. నగరంలోని 9వ డివిజన్‌లో సోమవారం ఆయన, సిటీ అభ్యర్థి ఎండీ ఖలీల్ అహ్మద్ కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా విజయసాయిరెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడే వైఎస్సార్‌సీపీని ఏమీ చేయలేకపోయిందని గర్తు చేశారు. చంద్రబాబు జీవితమంతా వెన్నుపోటు రాజకీయాలతో నిండిపోయిందన్నారు. ఆయనకు వచ్చే ఎన్నికల్లో ప్రజలు గుణపాఠం చెప్పడం ఖాయమన్నారు. నెల్లూరు అభివృద్ధి కోసం ఇచ్చిన హామీలను వచ్చే ఐదేళ్ల కాలంలో నెరవేర్చి తీరుతామని స్పష్టం చేశారు. 9వ వార్డు కార్పొరేటర్ రాజశేఖర్ టీడీపీకి అమ్ముడుబోయి వైఎస్సార్‌సీపీకి వెన్నుపోటు పొడిచాడని మండిపడ్డారు. మొదటి నుంచి పార్టీకి అండగా నిలిచిన ఈ వార్డులోని కార్యకర్తలకు ధన్యవాదాలు తెలిపారు. రాష్ట్రంలోని మిగిలిన జిల్లాల కన్నా నెల్లూరును మెరుగైన జిల్లాగా మారుస్తానని హామీ ఇచ్చారు. టీడీపీ అభ్యర్థులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, పొంగూరు నారాయణలా తనకు వ్యాపారాలు లేవని, ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటానన్నారు. డ్రెయినేజీ వ్యవస్థను మెరుగుపరుస్తానన్నారు. ఐదేళ్లలో 9వ డివిజన్‌లో సంక్షేమాభివృద్ధికి రూ.72.64 కోట్లను ప్రభుత్వం ఖర్చు చేసిందన్నారు. డివిజన్‌లో గాంధీ పార్కును అభివృద్ధి చేస్తామన్నారు. తనను, ఖలీల్‌ను గెలిపించాలని కోరారు. ఖలీల్ మాట్లాడుతూ సిటీ నియోజకవర్గంలో అభివృద్ధి, సంక్షేమం కొనసాగాలంటే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి సీఎంను చేయాల్సిన అవసరముందన్నారు. కార్యక్రమంలో నుడా చైర్మన్ ముక్కాల ద్వారకానాథ్, పార్టీ నగరాధ్యక్షుడు సన్నపరెడ్డి పెంచలరెడ్డి, నాయకులు ఆనం జయకుమార్‌రెడ్డి, కిన్నెర ప్రసాద్, డివిజన్ ఇన్‌చార్జి శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


కరపత్రం అందజేస్తున్న విజయసాయిరెడ్డి, ఖలీల్ అహ్మద్

'సర్వేపల్లి' ప్రజల ఆదరణ మర్చిపోను



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాకాణి గోవర్ధన్‌రెడ్డి, చిత్రంలో నాయకులు

- రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి

వెంకటాచలం: 'సర్వేపల్లి నియోజకవర్గ ప్రజల ఆదరణ మర్చిపోను. జీవితాంతం గుర్తు పెట్టుకుంటా' అని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి కాకాణి గోవర్ధన్‌రెడ్డి తెలిపారు. సోమవారం వెంకటాచలంలో నామినేషన్ వేసిన అనంతరం గోవర్ధన్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. అన్నీ వర్గాలకు చెందిన వారితో కలిసి నామినేషన్ వేశానన్నారు. నియోజకవర్గ ప్రజలకు రుణపడి ఉంటానని తెలియజేశారు. మూడోదఫా అవకాశం కల్పించిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఐదేళ్ల వైఎస్సార్‌సీపీ పాలనలో చెప్పిన దాని కంటే మిన్నగా అభివృద్ధి చేయడం జరిగిందన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి చేసిన అభివృద్ధి పనులు, ప్రజలకు అందించిన సంక్షేమ పథకాలు మరోసారి ఆయన్ను సీఎం చేసేందుకు దోహదపడతాయన్నారు. తనకు మరోసారి అవకాశం కల్పిస్తే నియోజకవర్గాన్ని పూర్తి స్థాయిలో అభివృద్ధి చేయిస్తామన్నారు. కార్యక్రమంలో మండల వైస్ ఎంపీపీ కనుపూరు కోదండరామిరెడ్డి, మండల కన్వీనర్ కొణిదెన మోహన్‌నాయుడు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలో చేరిన వారికి సముచిత స్థానం


పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి

- కోవూరు ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి

విడవలూరు: వైఎస్సార్‌సీపీలో చేరిన వారికి సముచిత స్థానం కల్పిస్తామని కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి తెలిపారు. మండలంలోని అలగానిపాడు, భద్రాచలం, పెద్దపాళెం గ్రామాల్లో సోమవారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అన్నారెడ్డిపాళెం, భద్రాచలం గ్రామాల నుంచి 40 కుటుంబాలు, పెద్దపాళెం పంచాయతీ నుంచి 30 మంది, అలగానిపాడు నుంచి ప్రముఖ పారిశ్రామికవేత్త ఇందుపూరు రిషికేశ్‌రెడ్డి వైఎస్సార్‌సీపీలో చేరారు. బుచ్చిరెడ్డిపాళెం మండలంలో ఎన్ఆర్‌జీఎస్ ఫీల్డ్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న ప్రసాద్ తన ఉద్యోగానికి రాజీనామా చేసి ప్రసన్న సమక్షంలో పార్టీలో చేరారు. వారందరికీ ఆయన కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు, చేసిన అభివృద్ధి పనులకు ఆకర్షితులై అనేకమంది తమ పార్టీలో చేరుతున్నారన్నారు. దేశం మొత్తం మన రాష్ట్రం వైపు చూసేలా జగన్ పాలన చేశారన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి పూండ్ల అచ్యుత్‌రెడ్డి, మండల గౌరవాధ్యక్షుడు కాటంరెడ్డి నవీన్‌రెడ్డి, జెడ్పీటీసీ తుమ్మల లక్ష్మయ్య, నాయకులు కొండూరు వెంకటసుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తెలుగుదేశం పార్టీవి నీచ రాజకీయాలు

- కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి


ఎమ్మెల్యే రామిరెడ్డికి మద్దతు ప్రకటించి సత్కరించిన ముస్లిం నాయకులు

కావలి: నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీని ఎదుర్కోలేక తెలుగుదేశం పార్టీ నీచ రాజకీయాలకు పాల్పడుతోందని కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని జనతాపేటలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కావలి టీడీపీకి చెందిన నాయకులు ఐదు సంవత్సరాలపాటు కనిపించకుండా ఎన్నికల సమయంలో వచ్చి వైఎస్సార్‌సీపీపై అభాండాలు వేస్తున్నారన్నారు. 17వ వార్డు పరిధిలో వైఎస్సార్‌సీపీకి ప్రతిసారి భారీ మెజార్టీ వస్తుండడంతో తమపై నిందలు వేయాలని టీడీపీ చెందిన కొందరు పథకం ప్రకారం బుడంగుంట సచివాలయంలో మద్యం బాటిళ్లు, బియ్యం బస్తాలను పెట్టారన్నారు. విచారణ జరగక ముందే టీడీపీ సోషల్ మీడియా తప్పుడు ప్రచారానికి తెరతీసిందన్నారు. వారే సచివాలయంలో బాటిళ్లు, బస్తాలు పెట్టి వైఎస్సార్‌సీపీపై బురద చల్లాలని చూశారని ప్రజలకు అర్థమైపోయిందన్నారు. గెలిచే సత్తా లేని కావలి టీడీపీ అభ్యర్థి కుట్రలకు పాల్పడుతున్నాడని విమర్శించారు. గ్రామాల్లో విభేదాలు సృష్టించి, పట్టణంలో రౌడీయిజం చేయాలని చూస్తున్నాడని, అతనికి ప్రజలే గుణపాఠం చెబుతారన్నారు. సచివాలయంలో మద్యం బాటిళ్లు పెట్టిన వారిపై విచారణ చేసి చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరామన్నారు. గతంలో తనపై టీడీపీకి చెందిన బీద రవిచంద్ర అక్రమంగా మద్యం కేసులు బనాయించారని, దానిపై విచారణ జరుగుతోందన్నారు. టీడీపీ కుట్ర రాజకీయాలకు భయపడే వారు ఎవరూ లేరన్నారు. తెలుగుదేశం అరాచకాలను ప్రజలు గమనించారని, మరోసారి వైఎస్సార్‌సీపీకి పట్టం కట్టేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పోలూరి శత జయంతి ఉత్సవాల సమావేశం రేపు

నెల్లూరు(బృందావనం): పోలూరి హనుమ జానకీరామశర్మ శతజయంతి ఉత్సవాల ఆరో సమావేశాన్ని పొగతోటలోని ఆదిశంకర ధ్యానమందిరంలో బుధవారం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు వేదం రాధాకృష్ణమూర్తి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పద్యకళా పరిషత్ అధ్యక్షుడు మెట్టు రామచంద్రప్రసాద్ అధ్యక్షతన జరిగే ఈ సమావేశంలో రామాయణ దర్శనంపై ముంబైకి చెందిన సురేంద్రనాథ్‌శర్మ ఉపన్యసిస్తారని తెలియజేశారు.

క్లుప్తంగా

కావలి నియోజకవర్గ అదనపు పరిశీలకుడిగా చేజర్ల


సుబ్బారెడ్డి

నెల్లూరు(దర్గామిట్ట): కావలి అసెంబ్లీ నియోజకవర్గ అదనపు పరిశీలకుడిగా ఉదయగిరి నియోజకవర్గానికి చెందిన చేజర్ల సుబ్బారెడ్డి నియమితులయ్యారు. పార్టీ అధ్యక్షులు, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ నియామకం చేసినట్లు కేంద్ర కార్యాలయం సోమవారం ప్రకటన విడుదల చేసింది.

కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల మార్పు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): సార్వత్రిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ నుంచి పోటీ చేసే అభ్యర్థులను మారుస్తూ కొత్త జాబితాను ఏఐసీసీ జనరల్ సెక్రటరీ కేసీ వేణుగోపాల్ సోమవారం విడుదల చేశారు. ఉమ్మడి నెల్లూరు జిల్లాకు సంబంధించి కోవూరు నియోజకవర్గం టికెట్‌ను గతంలో మోహన్‌రెడ్డికి ప్రకటించారు. తాజాగా నారపరెడ్డి కిరణ్‌కుమార్‌రెడ్డికి ఇచ్చారు. సర్వేపల్లిలో చంద్రశేఖర్‌కు బదులు పీవీ శ్రీకాంత్, గూడూరులో వేమయ్యకు బదులు రామకృష్ణరావు, సూళ్లూరుపేటలో తిలక్‌బాబుకు బదులు చాముండి శివ బరిలోకి దిగనున్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

నెల్లూరు(క్రైమ్): వంట చేస్తుండగా తీవ్రగాయాలపాలై ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఓ వ్యక్తి మృతిచెందాడు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి.. తోటపల్లిగూడూరుకు చెందిన శంకరయ్య (58) కుటుంబ కలహాల నేపథ్యంలో సుమారు ఆరు సంవత్సరాల క్రితం ఇంటి నుంచి వచ్చేసి గోమతినగర్‌లోని సర్వేపల్లి కాలువ వద్ద ఒంటరిగా నివాసం ఉంటున్నాడు. మార్బుల్ పనులు చేసేవాడు. ఈనెల ఏడో తేదీన ఎలక్ట్రిక్ కుక్కర్‌లో వంట చేస్తుండగా ప్రమాదవశాత్తు కూర గిన్నె చేయి జారి శరీరంపై పడడంతో తీవ్రగాయాలయ్యాయి. అతడిని చికిత్స నిమిత్తం జీజీహెచ్‌కు తరలించారు. ఈనెల 17వ తేదీన శంకరయ్యను ఆయన కుమారుడు వంశీకృష్ణ మెరుగైన చికిత్స నిమిత్తం నారాయణ హాస్పిటల్‌కు తరలించారు. అక్కడ కోలుకోకపోవడంతో రెండురోజుల క్రితం మళ్లీ జీజీహెచ్‌లో చేర్పించారు. శంకరయ్య సోమవారం మృతిచెందాడు. వంశీకృష్ణ ఫిర్యాదు మేరకు బాలాజీనగర్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ముత్తుకూరు మండలంలో టీడీపీ ఖాళీ


పార్టీలో చేరిన వారితో కాకాణి గోవర్ధన్‌రెడ్డి

- వైఎస్సార్‌సీపీలో భారీగా చేరికలు

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: ముత్తుకూరు మండలంలో తెలుగుదేశం పార్టీకి మరో షాక్ తగిలింది. ఇక్కడ ఆ పార్టీ ఖాళీ అయ్యే పరిస్థితులు ఏర్పడుతున్నట్లు తెలుస్తోంది. పైనాపురం గ్రామ పంచాయతీ నుంచి ఒక్కసారిగా 200 కుటుంబాలు వైఎస్సార్‌సీపీలో చేరాయి. సోమవారం నెల్లూరులో మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి సమక్షంలో జరిగిన ఈ భారీ చేరికలతో నామినేషన్ సమయానికి టీడీపీ అభ్యర్థి సోమిరెడ్డికి పెద్ద షాక్ తగిలినట్టయ్యింది.

కాలువలో దూకి వృద్ధుడి ఆత్మహత్య

నెల్లూరు(క్రైమ్): అనారోగ్య సమస్యలో, కుటుంబ కలహాలో స్పష్టంగా తెలియదు గానీ నెల్లూరు రంగనాయకులపేటలోని రైలువీధికి చెందిన జమీర్ (67) అనే వృద్ధుడు జాఫర్‌సాహెబ్ కాలువలో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల కథనం మేరకు.. రైలువీధికి చెందిన జమీర్, కుర్షీద్ దంపతులకు ఐదుగురు సంతానం. అందరికీ వివాహాలయ్యాయి. భార్యాభర్తలు కుమారుడు మున్నా వద్ద ఉంటున్నారు. జమీర్ సైకిల్ రిపేర్, మున్నా పూల డెకరేషన్ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. అనారోగ్య సమస్యలు లేదా కుటుంబ కలహాలో తెలియదు గానీ సోమవారం ఇంటి నుంచి వెళ్లిన జమీర్ జాఫర్ సాహెబ్ కాలువలో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికుల సమాచారంతో మున్నా సంతపేట పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వారు ఘటనా స్థలానికి చేరుకుని స్థానికుల సహకారంతో మృతదేహాన్ని వెలికితీశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్‌కు తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గురుకుల విద్యార్థుల ప్రతిభ

నెల్లూరు(అర్బన్): పదో తరగతి ఫలితాల్లో అంబేడ్కర్ గురుకుల విద్యాలయాల విద్యార్థులు ప్రతిభ చూపారని జిల్లా కో–ఆర్డినేటర్ హేమలత తెలిపారు. సోమవారం ఆమె స్థానిక కార్యాలయంలో వివరాలు వెల్లడించారు. పెద్దపవని, కందలేరు గురుకులాల్లో నూరుశాతం ఉత్తీర్ణత నమోదైందన్నారు. సంగంలో 97.50 శాతం, బుచ్చిరెడ్డిపాళెం, ముత్తుకూరుల్లో 97.04, ఆదూరుపల్లిలో 96.05, కోడూరులో 95, బోగోలులో 90.78, మొత్తంగా 96.67 శాతం ఉత్తీర్ణత సాధించారన్నారు. పెద్దపవనిలోని గీతిక 584 మార్కులతో గురుకులాల్లో మొదటి స్థానాన్ని, సంగం విద్యార్థిని హేమమ్మ 580 మార్కులతో ద్వితీయ స్థానాన్ని పొందారన్నారు.

కేజీబీవీల్లోనూ..

జిల్లాలోని 12 కస్తూర్బా గాంధీ విద్యాలయాల్లో 10వ తరగతి ఫలితాల్లో మెరుగ్గా వచ్చాయని సమగ్రశిక్ష అభియాన్ ఏపీడీ ఉషారాణి తెలిపారు. కలిగిరి, నందిపాడు, లింగసముద్రం, వీవీపాళెం పాఠశాలల్లో నూరు శాతం, ఏఎస్‌పేటలో 97.43, ఉలవపాడులో 96.85, గుడ్లూరులో 94, మర్రిపాడులో 92.3, కొండాపురంలో 87.5, కావలిలో 85, ఎస్ఆర్‌పురంలో 74.19, కందుకూరులో 73.64 శాతం, మొత్తంగా 91.78 శాతం ఉత్తీర్ణత సాధించామన్నారు. ప్రణీత అనే విద్యార్థిని 571 మార్కులతో ప్రథమ స్థానంలో వచ్చినట్లు తెలియజేశారు.

నిమ్మ ధరలు (కిలో)



పెద్దవి : రూ.78
సన్నవి : రూ.60
పండ్లు : రూ.40

'పది'లో మరింత మెరుగ్గా..

నెల్లూరు(అర్బన్): పదో తరగతి ఫలితాల్లో ప్రభుత్వ ఆధ్వర్యంలో నడుస్తున్న పాఠశాలలు మెరుగైన ఫలితాలు సాధించాయి. పేద పిల్లలు ప్రభుత్వం కల్పించిన వసతులను ఉపయోగించుకుని కార్పొరేట్ విద్యాసంస్థలకు దీటుగా అత్యధిక మార్కులు సాధించారు. గత సంవత్సరం ఫలితాలతో పోలిస్తే ఈ ఏడాది 12.56 శాతం మంది అధికంగా ఉత్తీర్ణులయ్యారు. రెండు ఏపీ మోడల్స్ స్కూల్స్, నాలుగు ఏపీ రెసిడెన్షియల్ సొసైటీ స్కూల్స్, రెండు సాంఘిక సంక్షేమ శాఖ రెసిడెన్షియల్ స్కూల్స్, రెండు ట్రైబల్ వెల్ఫేర్ సొసైటీ రెసిడెన్షియల్ స్కూల్స్, నాలుగు కేజీబీవీఎస్ (ఎస్ఎస్ఏ) పాఠశాలలు, 23 జెడ్పీ పాఠశాలల్లో నూరు శాతం ఉత్తీర్ణత నమోదైంది. 143 ప్రైవేటు పాఠశాలల్లో 100 శాతం ఉత్తీర్ణత వచ్చింది.

మేనేజ్‌మెంట్	పరీక్షలు రాసిన వారు	పాసైన వారు	ఫెయిలైన వారు	ఉత్తీర్ణతా శాతం
ఏపీ మోడల్ స్కూల్స్	698 మంది	655 మంది	43 మంది	93.84
ఏపీ రెసిడెన్షియల్ సొసైటీ	379	369	10	97.36
ఏపీఎస్‌డబ్ల్యూ రెసిడెన్షియల్	631	611	20	96.83
ఏపీ ట్రైబల్ వెల్ఫేర్	257	211	46	82.1
సెంట్రల్ గవర్నమెంట్	18	15	3	83.33
కేజీబీవీఎస్	437	401	36	91.76
జెడ్పీ పాఠశాలలు	10,247	8,285	1,962	80.85
మున్సిపల్ పాఠశాలలు	1,855	1,399	456	75.42
ఎయిడెడ్	338	229	109	67.75
రాష్ట్ర ప్రభుత్వ పాఠశాలలు	950	679	271	71.47
ట్రైబల్ వెల్ఫేర్ ఆశ్రమ	63	56	7	88.89
ప్రైవేట్ అన్‌ఎయిడెడ్	11,914	11,590	324	97.28